క్లుప్తంగా

రాయిపోలమ్మకు చల్లదనం



ముర్రాటలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని పట్టుపురంలో గల రాయిపోలమ్మ గ్రామదేవత ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ రాయిపోలమ్మ తల్లికి ముర్రాటలతో చల్లదనం చేశారు. ఉదయం నుంచే అర్చనలు, పూజలు, పసుపునీళ్లతో అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారికి ప్రసాదాన్ని అందించి, యేటలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. గ్రామాన్ని చల్లగా చూడాలని, పంటలు బాగా పండాలని పోలమ్మ తల్లిని కోరుకున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ మురళీమోహన్

సరుబుజ్జిలి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ పీవీ మురళీ మోహన్‌కుమార్ తెలిపారు. రొట్టవలస జంక్షన్‌లో గ్రామస్తులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. మండల సచివాలయాల కోఆర్డినేటర్ మూడడ్ల రమణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని దృష్టికి రాజావీధితోపాటు పలు వీధులకు చెందిన ప్రజలు తీసుకెళ్లారు. సోమవారం కురిసిన భారీవర్షానికి పలువురి ఇళ్లల్లోకి వరదనీరు చొరబడి ధాన్యం, జీడి పిక్కలు పూర్తిగా తడిచిపోవడంతో వాటిని అధికారులు మంగళవారం పరిశీలించారు. ఇంతకుముందు ఇటువంటి సమస్యరాలేదని, ఈ మధ్య కాలంలోనే సమస్య ఏర్పడిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు జయమునిరావు, స్థానికులు తెలిపారు. వర్షా కాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఏఓ తిరుపతిపట్నాయక్, కార్యదర్శి లక్ష్మణరేఖ, గ్రామస్తులు ఉన్నారు.

హెల్మెట్ ధారణతో రక్షణ



యువకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వినోద్‌బాబు

పాతపట్నం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని పాతపట్నం సీఐ ఎం.వినోద్‌బాబు సూచించారు. పాతపట్నం బస్‌స్టాండ్ వద్ద మంగళవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. చిన్న పొరపాటు జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేస్తుందన్నారు. కుటుంబ సభ్యులు కూడా తమ వారికి హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. ఏఎస్ఐ సింహచలం, పోలీసులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి అంకురార్పణ



కుంకుమార్చనలు నిర్వహిస్తున్న మహిళలు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో గల కోదండరామ స్వామి ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణానికి అంకురార్పణ చేపట్టారు. గురువారం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆమదాలవలస: మండలంలోని నాగావళినది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ సీఐ సునీల్‌కుమార్, సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. పాతూరు గ్రామం సమీపంలో రహదారిపై ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో..

ఆరోగ్య భరోసా



బొరిగివలసలో సంపూర్ణ పోషణ కిట్లతో లబ్ధిదారులు

- లబ్ధిదారులకు ఆరు రకాల పౌష్టికాహార పదార్థాల పంపిణీ
- గర్భిణీగా నమోదైనప్పటి నుంచి ప్రసవానంతరం ఆరు నెలల వరకు కిట్లు అందజేత..
- నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లో 8,363 మందికి కిట్లు సరఫరా

నరసన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ల నుంచి అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం మంచి ఫలితాలను ఇస్తోంది. పోషక విలువలు తక్కువగా ఉన్న గర్భిణులు, బాలింతలు ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రసవ సమయంలో, ప్రసవానంతరం రక్తహీనతతో మృత్యువాత పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రిగా జగన్‌మోహనరెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని భావించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా గర్భిణీగా నమోదైనప్పటి నుంచి ప్రసవానతంర ఆరు నెలల వరకు నెల వారీ ఆరు రకాల పౌష్టికాహార పదార్థాలతో కిట్ అందిస్తోంది. వీటితోపాటు పోషక విలువలతో కూడిన భోజనాన్ని మధ్యాహ్నం అందిస్తున్నారు. భోజనానికి రాని వారికి రోజుకో గుడ్డు, వారానికి లీటర్ పాలు సరఫరా చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతల ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందని వైద్యులు అంటున్నారు.

సంపూర్ణ పోషణ పథకం లబ్ధిదారుల వివరాలు(2023 మార్చి నెల)..

మండలం	గర్భిణులు	బాలింతలు
నరసన్నపేట	406	519
పోలాకి	384	424
సారవకోట	275	260
జలుమూరు	320	301
పాతపట్నం	283	368
మెళియాపుట్టి	282	366
హిరమండలం	248	346
కొత్తూరు	240	249
ఎల్ఎన్‌పేట,సరుబుజ్జిలి	621	770
ఆమదాలవలస రూరల్	241	245
బూర్జ	181	250
పొందూరు	383	400

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్ ఇలా..

ఈ కిట్‌లో ఆరు రకాల ఆహార పదార్థాలు ఉంటాయి. కేజీ రాగి(చోడి) పిండి, కేజీ చిరుధాన్యాల పిండి, కేజీ అటుకుళ్లు, పావు కేజీ శనగ చెక్కీ, పావు కేజీ బెల్లం, పావు కేజీ ఎండు కర్జూరం ఇస్తున్నారు.

నాణ్యత బాగుంది



అంగన్‌వాడీ కేంద్రాల ప్రతీ నెల ఇస్తున్న ఆరు రకాల పదార్థాలు చాలా బాగున్నాయి. సక్రమంగా వాడుతున్నాను. వీటితో పాటు గుడ్లు, పాలు ఇస్తున్నారు. వీటిని తినడం ద్వారా ఆరోగ్యం బాగా మెరుగుపడింది.

– చిక్కాల త్రివేణి, బొరిగివలస కాలనీ

ప్రతిఒక్కరూ వినియోగిస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషకాహార కిట్లు ఇస్తున్నాం. పౌష్టికాహారంపై అవగాహన కలిగిస్తున్నాం. ప్రతిఒక్కరూ ఈ కిట్లను సక్రమంగా వినియోగిస్తున్నారు.

– సి.హెచ్.లక్ష్మీనర్సమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త, బొరిగివలస

అర్హులందరికీ అందజేస్తున్నాం



ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సరఫరా చేస్తోంది. వీటిని అర్హులందరికీ సకాలంలో అందజేస్తున్నాం. నరసన్నపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతతో ఈ కిట్లును లబ్ధిదారులకు సకాలంలో అందిస్తున్నారు.

– నాగమణి, పీఓ, నరసన్నపేట ప్రాజెక్టు

జిల్లాలో మరో 11 సహకార బ్యాంకులు



మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ వరప్రసాద్

మెళియాపుట్టి: ప్రజలకు అతి తక్కువ సమయంలో, అతి తక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తున్నామని సహకార బ్యాంక్ జిల్లా ముఖ్య కార్యనిర్వాహక అధికారి డి.వరప్రసాద్ అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని కొసమాల పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం 25 సహకార బ్యాంక్‌లను నిర్వహిస్తున్నామని, వాటి ద్వారా సుమారు రూ.2000 కోట్లు టర్నోవర్ అవుతుందని, మరో 11 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకుల సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలు ఉపయోగపడతాయన్నారు.

శ్రేయామిశ్రోకు నర్తన సౌందర్య లహరి అవార్డు



శ్రేయామిశ్రో

పాతపట్నం: రాజమహేంద్రవరంలో ఇటీవల లలిత కళా నృత్య నికేతన్ ఆధ్వర్యంలో అందెలరవళి సౌందర్య లహరి పాటకు పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయామిశ్రో నృత్యం చేసి ప్రతిభ కనబరిచారు. భారతీయ నృత్యోత్సవం-6 కార్యక్రమంలో మిశ్రో నృత్యం ఆకట్టుంది. మిశ్రో చేసిన నృత్యానికి నిర్వాహకులు నర్తన సౌందర్య లహరి అవార్డును అందించారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ స్ఫూర్తి అవార్డును, ఐసీఎండీఏలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన నృత్య పోటీల్లో వరల్డ్ రికార్డు సైతం సాధించారు.

ఎస్సీ బాలుర వసతిగృహం పరిశీలన




ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం పరిశీలించారు. వసతి గృహంలోకి మురుగునీరు ఎలా చేరిందని వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహానికి ఎదురుగా ఉన్న మురుగు కాలువను మట్టితో రైతులు కప్పేయడంతోపాటు ప్రతి ఇంటి ముందు ఉన్న కాలువలో మట్టి వేయడంతో మురుగునీరుతోపాటు వర్షం నీరు వచ్చినట్లు వార్డెన్ ఉమామహేశ్వరావు వివరించారు. స్థానిక రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మురుగు నీరు పూర్వం ఎలా వెళ్లేదో అలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.బాలకు ఆదేశించారు. అవసరమైతే ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల అనుబంధ వసతి గృహంలో ప్రస్తుతం ఉంటున్న ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థుల వద్దకు వెళ్లి పరామర్శించారు. యూనిఫాం, నోట్స్ పంపిణీ చేయాలని ఎంఈఓ శ్రీధర్‌కు ఆదేశించారు. విద్యార్థులకు అట్టలు, పెన్నులు, నోట్స్‌పాటు పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు అనవరమైన పుస్తకాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, కుంచాల నూకరాజు, లోతుగెడ్డ తిరుపతిరావు, బూర్లె శ్రీనివాసరావు, ఎం.చక్రపాణి, చుక్కా రాంబాబు, చోడవరపు జోగినాయుడు, వై.ధర్మారావు, పంకజదాస్, వనము లక్ష్మీనారాయణ, గండివలస ఆనందరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

56 మందికి కంటి పరీక్షలు

కొత్తూరు: మండలంలోని సోమరాజపురంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శిమ్మ మధుసూదనరావు మంగళవారం ప్రారంభించారు. 56 మందికి కొత్తూరు సీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. నలుగురుని శస్త్ర చికిత్సల కోసం గుర్తించామని, శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. 26 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరికి కళ్లద్దాలను త్వరలో పంపిణీ చేస్తామన్నారు. మరో 25 మందికి సాధారణ కంటి జబ్బులు ఉన్నట్లు గుర్తించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నరసన్నపేట: నృత్యం చేస్తున్న విద్యార్థులు



ఆమదాలవలస రూరల్: గ్రూప్ డాన్స్ చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎంఈఓ శాంతారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందడి చేశారు. హెచ్ఎం వెంకటరావు, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస రూరల్: మండలంలోని కొర్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని హెచ్ఎం ఎం.దేవరాణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు చేసిన డాన్స్‌లు ఎంతోగానో ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం తులసీరావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఉన్నత చదువుల్లో భాగారాణించి మంచి పేరుప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.



సరుబుజ్జిలి: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎల్.ఎన్.పేట:మహిళా స్వయం శక్తి సంఘాలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: మహిళా సంక్షేమానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథకం (వైకేపీ) ఆధ్వర్యంలో కోవిలాం కూడలి వద్ద ఆసరా 3వ విడత నగదు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలో అన్ని డ్వాక్రా సంఘాలు ఏ గ్రేడ్‌లో ఉన్నాయన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్, ఈఓపీఆర్డీ శ్యామలాదేవి, వైకేపీ ఏపీఎం ఎస్ రవిరాజ్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బి.సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారుల, గ్రామ సచివాలయ, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని కొత్తకోట ఎంపీటీసీ సురవరపు సింహాచలం తెలిపారు. 3వ విడత ఆసరా సంబరాలు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. 44 సంఘాల్లోని సభ్యులకు రూ.43.29 లక్షలు జమచేయడం జరుగుతుందని వైకేపీ ఏపీఎం కలమకుమారి పాండ్యన్ వెల్లడించారు. సీసీ రోజాలత, వీఓఏ జ్యోత్స్న పాల్గొన్నారు.

సారవకోట: మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చిన్నగుజ్జువాడ సర్పంచ్ కొండాల బాబూరావు అన్నారు. గ్రామంలో ఆసరా మూడో విడత సంబరాలు నిర్వహించారు. వైకేపీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



సారవకోట: మాట్లాడుతున్న సర్పంచ్ బాబూరావు



సరుబుజ్జిలి: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న మహిళలు

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

పొందూరు: చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎల్.హేమనాచార్యులు అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.లక్ష్మి పాఠశాలలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారంగా ఏర్పాడ్డారు. చిరుధాన్యాల అవశ్యకతపై అవగాహన కల్పించారు.

వైభవంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ట



కొత్తూరు మండలంలోని నివగాం గ్రామంలో నూకాలమ్మ విగ్రహం మంగళవారం పునఃప్రతిష్ఠించారు. మహిళలు ముర్రాటలతో తిరువీధి చేపట్టి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి చల్లదనం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. – కొత్తూరు

సంక్షిప్తంగా..

రేపటి నుంచి శ్రీరామ నవమి వేడుకలు

పాతపట్నం: మండలంలోని పెద్దలోగిడి గ్రామంలో ఉన్న కోదండరామస్వామి, అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. కోదండరామస్వామి 12వ వార్షిక మహోత్సవం నిర్వహించనున్నామని అర్చకుడు సూర్యానారాయణ తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

సరుబుజ్జిలి: ప్రతిఒక్కరూ ఆధార్ కార్డును (2016 లోపువారు) అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. సరుబుజ్జిలి సచివాలయంలో జరుగుతున్న ఆధార్ అప్‌డేట్ స్పెల్‌డ్రైవ్‌ను మంగళవారం పరిశీలించారు. గ్రామ వలంటీర్ల ద్వారా ప్రతీ ఒక్కరికి సమాచారం అందించి శతశాతం అప్‌డేట్ జరిగేలా బాధ్యత తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

రూ.6.40 లక్షలకు వేలం ఖరారు

హిరమండలం: స్థానిక పంచాయతీ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ రోజువారీ ఆశీలు వసూలు చేసేందుకు వేలం ఖరారైంది. మండల కేంద్రంలని దిగువీధికి చెందిన సైలాడ పాపారావు రూ.6.40 లక్షలకు అధిక మొత్తానికి పాట దక్కించుకున్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్ డి.సుందరమ్మ అధ్యక్షతన వేలం పాటను ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు మంగళవారం నిర్వహించారు. వేలంలో 15 మంది సభ్యులు పాల్గొన్నారు. జూనియర్ అసిస్టెంట్ నర్సింగరావు, బిల్ కలెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.19.5 లక్షలతో అభివృద్ధి పనులు

పాతపట్నం: మేజర్ పంచాయతీ పరిధిలోని కాల్వర్టులు, డ్రైనేజీలను రూ.19.5లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్ తెలిపారు. జూబ్లిహిల్స్ కల్వర్టు పనులను పంచాయతీ ఈఓ కూర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శిర్ల జోగారావు కలిసి మంగళవారం పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జోగారావు మాట్లాడుతూ జూబ్లిహిల్స్ కల్వర్టుకు రూ.4లక్షలు, ఎస్సీవీధిలోని కల్వర్టుకు రూ.4.5 లక్షలు, కాపువీధిలోని కల్వర్టుకు రూ.లక్ష, శివశంకర్-1 లైన్ నుంచి సత్యసాయి నగర్‌కు 250 మీటర్ల కల్వర్టుకు రూ.10లక్షలతో పనులు చేస్తున్నామన్నారు.

సామాజిక సేవతో గుర్తింపు

ఆమదాలవలస రూరల్: విద్యార్థులు సామాజిక సేవలో పాల్గొంటే మంచి గుర్తింపుతోపాటు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవచ్చునని చిట్టివలస సర్పంచ్ గుజ్జల జగదీశ్వరి అన్నారు. చిట్టివలసలో ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో సేవలు అందించి అందరి మన్ననలు పొందాలని సూచించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణ రావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జె.వెంకటేశ్వరారవు, అధ్యాపకులు ఎస్.నర్సింగరావు, చంద్రశేఖర్, పెంటయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ జె.రవిబాబు పాల్గొన్నారు.

గ్లాసుల అందజేత

కొత్తూరు: మండలంలోని బలద ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రాగి జావ పట్టేందుకు 202 స్టీల్ గ్లాసలను వైఎస్సార్‌సీపీ నాయకుడు సారిపల్లి తిరుపతిరావు వితరణ చేశారు. వీటిని పార్టీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు పలు రకాల పోషక విలువలతో కూడిన ఆహారాన్ని పెడతున్నట్లు తెలిపారు. దీంతో పాటు వారంలో మూడు రోజులు ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. హెచ్ఎం నర్సింహరావు, ఎస్ఎంసీ చైర్మన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రామలీలా కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

పొందూరు: మండలంలోని లైదాం గ్రామంలో శివానంద ధర్మక్షేత్రంలో మంగళవారం నుంచి రామలీలా కల్యాణ మహోత్సవాలు, సీతారామ మహోయజ్ఞం వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఈ నెల 29న సమస్త దోష పరిహారం పూజలు, 30న విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుదలకు గణపతి హోమం, 31న చండీహోమం, కుంకుమ పూజలు, ఏప్రిల్ 1న నవగ్రహ హోమం, 2న సూర్యగ్రహారాధన హోమాలు, 3న రుద్రాభిషేకం, 4న కాత్యాయినీ వ్రతం, 5న సరస్వతీదేవి పూజ, 5న గోపూజ, పుత్రకామేష్టి యజ్ఞం, 7న ఆయుష్యహోమం, పట్టాభిషేకం నిర్వహించనున్నారు. 6న సీతారాముల తెప్పోత్సవం, లక్ష దీపారాధన, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు గొర్లె అనంత రామకృష్ణ తెలిపారు.

విద్యా సామగ్రి వితరణ

ఆమదాలవలస: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ మార్కులు పొందవచ్చునని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్, వ్యాపారవేత్త శిల్లా మల్లికార్జునరావు అన్నారు. లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 260 మందికి పెన్నులు, పెన్సిళ్లు, అట్టలు, పరీక్ష సామగ్రి వితరణ చేశారు. ఈ సామగ్రిని మంగళవారం విద్యార్థులకు అందజేసారు. పరీక్షలకు హాజరయ్యేందుకు హాల్ టిక్కట్లను హెచ్ఎం పి.వి.రమణమ్మ ఆధ్వర్యంలో అందజేశారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

కొత్తూరు: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉన్న 35 మంది విద్యార్థులకు కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. వసతి గృహంలోకి మురుగునీరు చేరి విద్యార్థుల దుప్పట్లు, దుస్తులు తడిచిపోయాయి. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని చైర్మన్‌కు ఎమ్మెల్యే రెడ్డి శాంతి సూచించారు. పీఏసీఎస్ డైరెక్టర్ కుంచాల నూకరాజు, మెట్టూరు బిట్-2 సర్పంచ్ యర్లంకి ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ శివాజీ, వార్డెన్ ఉమామహేశ్వరరావు ఉన్నారు.

నీలమణి అమ్మవారికి పుష్పాభిషేకం

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణి అమ్మవారి ఆలయంలో చైత్రమాస త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పది వేల పుష్పాలతో అలంకరించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. గురువారం అమ్మవారిని అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాలలో తిరువీధి నిర్వహించనున్నారు.

సౌకర్యాలపై ఆరా

మెళియాపుట్టి: వసతి గృహాల్లోని విద్యార్థులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని, మెనూ పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ సరోజిని అన్నారు. మండలంలోని పెద్దమడి బాలికల ఆశ్రమ పాఠశాల, పెద్దలక్ష్మీపురం ఎస్సీ, బీసీ వసతిగృహాలను మంగళవారం సందర్శించారు. మౌలిక సదుపాయాల కల్పన, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. వారికి ఉచితంగా అందిస్తున్న సబ్బులు, నూనె, తదితర సామగ్రి సక్రమంగా అందుతున్నాయా, లేదా, అని ఆరా తీశారు. పెద్దమడి బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు.